ఈనాడు
ఖమ్మం

మానవత్వం లేదా.. అధికారులపై కలెక్టర్ మండిపాటు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: 'ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు పనిచేస్తున్నారా..? మరిన్ని సమస్యలు సృష్టిస్తున్నారా..? కొంచెమైనా మానవత్వం లేదా..? మీరు కచ్చితంగా పనిచేస్తే బాధితులు నా ముందుకొచ్చి ఎందుకు కన్నీళ్లు పెట్టుకుంటారు' అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖమ్మం అర్బన్ తహసీల్దార్ స్వామిపై సోమవారం మండిపడ్డారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలను స్వీకరించారు. ఆరోగ్యశాఖలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టు కోసం బీసీ కుల ధ్రువపత్రం ఇవ్వాలని ఖమ్మం అర్బన్ తహసీల్ కార్యాలయంలో దరఖాస్తు చేయగా పలుమార్లు తిప్పించుకొని.. రుజువులు కావాలని తిరస్కరించారని కలెక్టర్‌కు విజ్జుదేవి అనే మహిళ ఫిర్యాదు చేశారు. 5వ తేదీతో దరఖాస్తు గడువు ముగిసిందని, అవకాశం కోల్పోయానని విలపించారు. స్వామిని కలెక్టరేట్‌కు పిలిపించి కలెక్టర్ మండిపడ్డారు. 2008 డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాలు జారీచేయనందున తొమ్మిది మంది ఉద్యోగాలు కోల్పోయారని, వారికి జరిగిన నష్టాన్ని ఎలా సరిచేస్తారని మందలించారు.

◆ పెనుబల్లి మండలం రామచంద్రరావు బంజరకు చెందిన పి.తిరుపతయ్య తన మనవడు పావన్ ఆదిత్య(8) మెదడులో రక్తం గడ్డకట్టడంతో నిమ్స్ ఆసుపత్రిలో చేర్చామని, ఆరోగ్యశ్రీకార్డు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందించగా కోఆర్డినేటర్‌ను కలెక్టర్ పిలిచారు. ఆయన స్థానంలో మేనేజర్ శ్రీనివాసరావు వెళ్లి కోఆర్డినేటర్ సెలవులో ఉన్నారని చెప్పటంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం దరఖాస్తుదారుడి సమస్యకు పరిష్కారంచూపాలన్నారు.



ప్రజావాణిలో అర్బన్ తహసీల్దార్ స్వామిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సన్నరకం ధాన్యానికి ప్రత్యేక కేంద్రాలు

ఖరీఫ్ సన్నధాన్యం కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రాథమిక అంచనాల మేరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం, లక్ష మెట్రిక్ టన్నులు దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, శిక్షణ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, డీఆర్డీఓ సన్యాసయ్య, అదనపు డీసీపీ ప్రసాదరావు, డీఎస్వో చందన్‌కుమార్, డీఎంసీఎస్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ట్రామా.. ఏర్పాటైతేనే ధీమా!



ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, ఖమ్మం వైద్యవిభాగం: రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు మొదటి గంట(గోల్డెన్ అవర్)లో వైద్యమందిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చునని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం ట్రామాకేర్ కేంద్రాలు దోహదపడతాయని పేర్కొంటున్నారు. వీటి ప్రాముఖ్యాన్ని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రాష్ట్రవ్యాప్తంగా ట్రామాకేర్ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే కొత్తగూడెం సర్వజనాసుపత్రిలో ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటుచేయాలని నిర్ణయించినా ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవటం గమనార్హం.


నెత్తురోడుతున్న జాతీయ రహదారులు

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల మీదుగా వెళ్తున్న జాతీయ రహదారులపై నిత్యం చోటుచేసుకునే ప్రమాదాల్లో పలువురు చనిపోతున్నారు. అధిక మంది గాయాలపాలవుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర వైద్యసేవలందించేందుకు ప్రధాన రహదారుల వెంటనున్న ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో ట్రామాకేర్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని కొన్నేళ్లుగా ప్రతిపాదనలు పంపిస్తున్నా.. అటువైపుగా అడుగులు పడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ట్రామాకేర్ కేంద్రాల ఏర్పాటును మళ్లీ తెరపైకి తెచ్చింది. ఇందులో భాగంగా కూసుమంచి మండలంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.

ట్రామాకేర్ కేంద్రాల్లో ఉండే సౌకర్యాలివే..

- క్షతగాత్రులకు అత్యవసరంగా సిటీస్కాన్ చేస్తారు.
- తీవ్రంగా గాయపడినవారికి ఎంఆర్ఐ స్కాన్ తీస్తారు.
- ఎముకలు విరిగిన వారికి అవసరమైన సామగ్రి సమకూర్చుతారు.
- ఆరోగ్యం విషమంగా ఉన్న వారి కోసం పది పడకలతో ఐసీయూ ఏర్పాటు చేస్తారు.

రోడ్డు ప్రమాదాలు	మరణాలు	రోడ్డు ప్రమాదాలు	మరణాలు
ఖమ్మం		భద్రాద్రి	
444	161	330	159
(జనవరి నుంచి సెప్టెంబరు)		(జనవరి నుంచి ఆగస్టు)	



కూసుమంచి మండలం గట్టుసింగారంలో ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటుకు స్థలం సేకరించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవగానే టెండర్ ప్రక్రియ చేపడతాం. ఈకేంద్రం వల్ల క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందుబాటులోకి వస్తుంది.

- డా.రాజశేఖర్, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి, ఖమ్మం

స్థల సేకరణ ప్రక్రియ పూర్తి

ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కూసుమంచి మండలం గట్టుసింగారంలో ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని సేకరించినట్లు అధికారులు తెలిపారు. ప్రజాప్రతినిధుల చొరవతో త్వరలోనే 100 పడకలతో ట్రామాకేర్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తామంటున్నారు. ఖమ్మం జిల్లా మీదుగా వెళ్తున్న ఖమ్మం-కోదాడ, కరీంనగర్-రాజమహేంద్రవరం, కోదాడ-కురవి వంటి జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో గాయపడిన వారికి మొదటి గంటలో అత్యవసర వైద్యం అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు.

పాలకులు పట్టించుకుంటేనే..

విజయవాడ-జగదల్‌పూర్, కొత్తగూడెం-హైదరాబాద్ జాతీయ రహదారులు భద్రాద్రి జిల్లా కేంద్రం మీదుగా వెళ్తున్నాయి. జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలను గుర్తించిన గత ప్రభుత్వం అత్యవసర వైద్యం కోసం 'టెరి'(తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఇనిషియేషన్) పేరిట ట్రామాకేర్ వైద్యసేవలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కొత్తగూడెం సర్వజనాసుపత్రిలో ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటుచేయాలని నిర్ణయించినా కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా పాలకులు పట్టించుకుంటే ట్రామాకేర్ కేంద్రం భద్రాద్రి జిల్లావాసులకు అందుబాటులోకి వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పుడు దళారులకే మద్దతు!

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెసల కొనుగోలు కేంద్రాల్లో దళారుల బెడద ఎక్కువవటంతో రెండు రోజులుగా క్రయవిక్రయాలకు అంతరాయం ఏర్పడింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ ద్వారా ఖమ్మం, వైరాలో కొనుగోలు కేంద్రాలను ఆగస్టు 27న ప్రారంభించిన విషయం విదితమే. చాలామంది రైతులు తొలినాళ్లలోనే సరకును కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పొందారు. క్రమేణా ఈకేంద్రాల్లోకి దళారుల చొరబాటు ఎక్కువైంది. ఇప్పుడు రైతుల కంటే దళారులే అధికంగా సరకు తీసుకొస్తున్నారని విజిలెన్స్ అధికారులు గుర్తించటం గమనార్హం.



ఖమ్మంలోని పెసల కొనుగోలు కేంద్రం

ఇదేం మర్మమో..?

ఖమ్మం, వైరా కొనుగోలు కేంద్రాల్లో 8వేల బస్తాల చొప్పున పెసలు కొనాలని ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. ఒక్కో కేంద్రానికి అదనంగా 2వేల బస్తాలు కొనుగోలు చేసేలా అనుమతివ్వాలని డీసీఎంఎస్ అధికారులు మార్క్‌ఫెడ్ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. అయితే ఒక్కో కేంద్రంలో అదనంగా 1,000 బస్తాలు మాత్రమే కొనేలా రాష్ట్రస్థాయి అధికారులు అనుమతించారు. దీనిని దళారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. రైతుల సరకును దాదాపు మొత్తం కొనేశామంటూనే అదనంగా ఖరీదు చేసేందుకు ఉన్నతాధికారులను నిర్వాహకులు అనుమతులు అడగటంపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దళారుల ప్రమేయంపై 'విజిలెన్స్' నివేదిక

రైతుల సరకు మొత్తం కొనుగోలు చేయటం పూర్తయ్యిందని, ఇప్పుడొచ్చే పెసలంతా వ్యాపారులు, దళారులదేనంటూ రాష్ట్ర ఉన్నతాధికారులకు విజిలెన్స్ కమిటీ నివేదిక సమర్పించింది. వాస్తవానికి రైతులు తమ సరకును చాలావరకు విక్రయించారు. గతంలో రైతుల దగ్గర తక్కువ ధరకు కొన్న దళారులు ప్రభుత్వం నెలకొల్పిన పెసల కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి సొమ్ము చేసుకోవాలని భావించారు. ఈవిషయాన్ని విజిలెన్స్ కమిటీ గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారమివ్వటంతో దళారుల ప్రయత్నాలకు అడ్డుకట్ట పడింది. ప్రస్తుతం ఒక్కో కొనుగోలు కేంద్రంలో 500 బస్తాల చొప్పున నిల్వలు పేరుకుపోయాయి.

	కొన్న బస్తాలు (క్వింటాళ్లలో)	విక్రయించిన రైతులు
ఖమ్మం	8,645(4,322.50)	667
వైరా	8,742(4,371.00)	597

చెల్లింపులు ఇలా..

పెసలు విక్రయించిన రైతులకు రూ.3.23 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.2.90 కోట్లను నిర్వాహకులు చెల్లించారు. మరో 587 మంది రైతులకు మిగతా సొమ్ము చెల్లించాల్సి ఉంది.

కొంతమంది రైతులకు సొమ్ము చెల్లించాల్సి ఉంది. వారందరికీ రెండు, మూడు రోజుల్లో చెల్లిస్తాం. రైతులకు సంబంధించిన సరకు మొత్తం కొనుగోలు చేశాం. కొంతమంది కర్షకుల సరకును ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంది.

- సునీత, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

ప్రభుత్వం ప్రత్యేకంగా పెసల కొనుగోలు కేంద్రాలు నెలకొల్పి రైతులకు న్యాయం చేసింది. రైతుల దగ్గర ఉన్న సరకును కొనటం దాదాపు పూర్తయ్యింది. పెసలు విక్రయించిన రైతులకు వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

- కొత్వాల శ్రీనివాసరావు, డీసీఎంఎస్ అధ్యక్షుడు

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లాలో మంగళవారం పర్యటించనున్నారు. సోమవారం రాత్రి 10.30గంటలకు ఖమ్మం చేరుకొని.. మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం 11.30 గంటలకు ఐడీఓసీలో జరిగే వరదల పునరుద్ధరణ పనులు, సాంఘిక సంక్షేమశాఖ సమీక్షా సమావేశానికి హాజరవుతారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల ఎన్‌పీడీఎస్‌సీఎల్ అధికారులతో సమీక్షించనున్నారు.

నేటి నుంచి చేప పిల్లల పంపిణీ

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి జి.శివప్రసాద్ సోమవారం తెలిపారు. కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్‌లో రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా వంద శాతం రాయితీపై ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

లక్ష్మీపురంలో సమీకృత గురుకుల పాఠశాల

చింతకాని, న్యూస్‌టుడే: పైలెట్ ప్రాజెక్టులో భాగంగా సమీకృత గురుకుల పాఠశాలను బోనకల్లు మండలం లక్ష్మీపురంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనుంది. దీనికి సంబంధించి ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు లక్ష్మీపురం రెవెన్యూలోని 25 ఎకరాల స్థలాన్ని సోమవారం పరిశీలించి ఎంపిక చేశారు. ఈ నెల 11న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్అండ్‌బీ ఈఈ తానేశ్వర్, మధిర డీఈ శంకర్‌రావు, తహసీల్దార్ పున్నంచందర్, ఏఈ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి కిశోర్‌కుమార్, గాలి దుర్గారావు పాల్గొన్నారు.

◆ ప్రతిపాదిత స్థలాన్ని డీఈఓ సోమశేఖరశర్మ పరిశీలించారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్టు తెలిపారు. ఆయన వెంట జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ఎంఈఓ దామాల పుల్లయ్య ఉన్నారు.



ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, కాంగ్రెస్ నాయకులు

జమలాపురంలో ఏకాదశ రుద్రాభిషేకం

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అయిదో రోజైన సోమవారం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. యాగశాలలో రుద్రహోమం చేశారు. దుర్గాదేవి అమ్మవారు భక్తులకు శ్రీమహాలక్ష్మీ అవతారంలో దర్శనమిచ్చారు. అన్నపూర్ణ భవన్‌లో అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షకురాలు కె.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, మురళీమోహనశర్మ పాల్గొన్నారు.

లాభాల పాలు

మధిర, న్యూస్‌టుడే: మోతుబరి రైతు కుటుంబమే అయినా కూలీల ఖర్చు పెరగటం, వ్యవసాయంలో ఒడిదొడుకులు రావటంతో డెయిరీ ఫామ్ వైపు మొగ్గుచూపారు. మూడేళ్లుగా మంచి లాభాలు గడిస్తున్నారు. 35 గేదెలు, 15 ఆవులతో రెండు వేర్వేరు షెడ్లు నిర్వహిస్తూ.. పాలను సొంతంగా విక్రయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మధిర పురపాలిక పరిధిలోని మడుపల్లికి చెందిన పుచ్చకాయల వెంకటనారాయణ. డెయిరీ ఫామ్ ప్రస్థానంపై ఆయన మాటల్లోనే వివరాలు..


గేదెల ఫామ్‌లో వెంకటనారాయణ

పెట్టుబడి: ఆవులు, గేదెల కొనుగోలుకు రూ.50లక్షలు, రెండు షెడ్ల నిర్మాణానికి రూ.30లక్షలు వెచ్చించాను. పశువులకు మేత కొరత రాకుండా ముందుగానే చర్యలు చేపట్టాలి. మార్కెట్‌లో పాలకు డిమాండ్ ఉంది. వీటి ధర పెరగటమే కానీ ఏనాడూ తగ్గలేదు. అందువల్లే కష్టమైనా.. స్వచ్ఛమైన పాలను ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో డెయిరీ ఫామ్‌ను ఎంచుకున్నా. నిత్యం పర్యవేక్షిస్తుంటే ఇందులోనూ మంచి లాభాలు సాధించవచ్చు.

మూడేళ్ల క్రితం: 35 గేదెలు, 15 ఆవులతో డెయిరీ ఫామ్ ఏర్పాటు చేశా. స్థానికంగా కూలీల కొరత వల్ల వీటి నిర్వహణ కోసం బిహార్ నుంచి పని వాళ్లను తీసుకొచ్చా. 35 గేదెల నుంచి రోజూ 160 లీటర్ల పాలు, 15ఆవుల నుంచి 60 లీటర్ల పాల దిగుబడి వస్తుంది. వీటిని ఉదయం, సాయంత్రం పూట మడుపల్లితోపాటు మధిర పురపాలికలోని కొన్ని ఇళ్లకు వెళ్లి విక్రయిస్తున్నా. లీటరు పాలు రూ.70కి అందిస్తున్నా.

పశుగ్రాసాలు..: సొంతంగా 18ఎకరాల మాగాణి ఉంది. దీంతోపాటు 20ఎకరాల మాగాణిలో వచ్చే వరిగడ్డిని కొనుగోలు చేస్తున్నా. సొంతంగా వచ్చిన వరిగడ్డి, కొన్న గడ్డిని వాములుగా మార్చి తడవకుండా టార్పాలిన్ పట్టాలు కప్పుతా. ఇందుకోసం రూ.25వేలు ఖర్చవుతుంది. పచ్చిమేత కోసం పదెకరాల్లో నేపియర్ గడ్డి పెంచుతున్నా. మరో పదెకరాల్లో పిల్లిపెసర సాగుచేస్తున్నా. ఇవి కాకుండా పదకొండెకరాల బత్తాయి తోటలో కొంతకాలం పచ్చిగడ్డి లభిస్తుంది. ఈ తోటలో ఆవుల డెయిరీ ఫామ్ ఏర్పాటు చేశాను.

ఐదేళ్ల పాటు నిర్వహిస్తే..: పశువుల ఎరువును సొంతంగా చేస్తున్న మాగాణి భూమికి, బత్తాయి తోటకు వినియోగిస్తా. దీనివల్ల మంచి దిగుబడులు సాధిస్తున్నాను. ఐదేళ్ల పాటు డెయిరీ ఫామ్‌ను తగిన జాగ్రత్తలతో నిర్వహిస్తే పెట్టుబడులు పూడుతాయి. ఫామ్ మిగులుతుంది.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు


పసుపు రంగులోకి మారుతున్న మొక్కజొన్న

మొక్కజొన్నలో ప్రస్తుతం అత్యవసర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కె.రవికుమార్ తెలిపారు. వర్షాలతో కొన్నిచోట్ల మొక్కజొన్న పసుపు రంగులోకి మారిందని, దీని నియంత్రణకు ఎకరాకు 30- 40 కిలోల యూరియాతో పాటు 20 కిలోల మ్యూరేటుఆఫ్ పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలని సూచించారు. ఆకుమచ్చ, ఆకు మాడు తెగులు కొన్నిచోట్ల ఆశించిందని, వీటి నియంత్రణకు మ్యాంకోజెబ్ 2.50 గ్రా. లేదా ప్రొఫికొనజెల్ ఒక మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కత్తెర పురుగు నియంత్రణకు క్లోరాంట్రోనిలిప్రోల్ 0.4 మి.లీ. లేదా స్పైనోటోరం 0.5 మి.లీ.ను లీటరు నీటికి కలిపి చల్లాలని తెలిపారు. ఎదిగిన లార్వా నివారణకు విషపు ఎరను పెట్టుకోవాలన్నారు. వరి తవుడు కలిపి పదికిలోలు, బెల్లం రెండు కిలోలను 2-3 లీటర్ల నీటిలో కలిపి 24 గంటలు పులియనిచ్చి థయోడికార్బ్ 100 గ్రాములు కలిపి ఉండలుగా తయారుచేసి సాయంత్రం పూట మొక్కల సుడుల వద్ద వేసుకోవాలని సూచించారు.

వైరా, న్యూస్‌టుడే

రైతేరాజు

మిరపలో తామర పురుగుల నివారణ ఇలా..



ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: మిరప నారు నుంచి ఆఖరి కోత వరకు తామర పురుగులు ఆశించి రసాన్ని పీలుస్తాయి. వాతావరణం పొడిగా, బెట్టగా ఉన్నప్పుడు ఈ పురుగులు తమ సంతతిని త్వరగా వృద్ధి చేసుకుంటాయి. ఖమ్మం జిల్లా ఉద్యానాధికారి జి.నగేశ్ చెబుతున్న వివరాల ప్రకారం.. ఈ పురుగుల వల్ల 30-50 శాతం మేర పంటకు నష్టం వాటిల్లుతుంది. తల్లి, పిల్ల పురుగులు గోధుమ రంగులో ఉండి ఆకు అడుగు భాగాన గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తాయి. కొన్నిసార్లు పూమొగ్గలు, పూలను ఆశిస్తాయి. సాధారణంగా లేత ఆకులు, కాండాలను ఆశిస్తాయి. దీని వల్ల ఆకులపై బొబ్బలు ఏర్పడి అంచులు పైకి ముడుచుకుపోతాయి. అందువల్ల దీనిని 'పైముడత' అంటారు. దీని ఉద్ధృతి అధికంగా ఉన్నప్పుడు లేత ఆకులు ఎదగక మొక్కలు గిడసబారతాయి. పూతరాలుతుంది. ఆకులు ఇటుక రంగులో కనిపిస్తాయి. ఈ పురుగులు ఆశించి రసాన్ని పీల్చటం వల్ల లేతకాయలపై చారలు ఏర్పడి గిడసబారతాయి. వీటి నివారణకు మిరప నారు నాటిన తర్వాత ఫిప్రోనిల్ గుళికలను 15, 45 రోజులకు ఎకరాకు 8 కిలోల చొప్పున సాళ్లలో ఎదబెట్టాలి. అవసరాన్ని బట్టి ఫిప్రోనిల్ 2మి.లీ. లేదా స్పైనిటోరమ్ 1మి.లీ. లేదా సైయాన్ ట్రానిలిప్రోల్ 1.2గ్రా. లేదా స్పైనోసాడ్ 0.25 మి.లీ. లేదా అసిటామెప్రిడ్ 0.2గ్రా/లీ లేదా థయోక్లోప్రిడ్ 0.6మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4గ్రా.లు లీటరు నీటికి కలిపి ఆకు కింది భాగం తడిచే విధంగా పిచికారి చేయాలి.

డాక్టర్ కె.రుక్మిణీదేవి, శాస్త్రవేత్త మధిర పరిశోధన స్థానం

ప్రశ్న జవాబు

? పత్తిలో రసం పీల్చే పురుగు, తామర, గులాబీరంగు పురుగులు ఆకులు, కాయలను ఆశిస్తున్నాయి. నివారణ మార్గాలు తెలపండి.
- కె.నాగేందర్‌రావు, బుచ్చిరెడ్డిపాలెం

◆ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పత్తిలో పచ్చదోమ, తామర పురుగులు ఆశించేందుకు అనుకూలం. నివారణకు పురుగుల ఉద్ధృతి తక్కువగా ఉన్నప్పుడు 5 మి.లీ., 1500 పీపీఎం వేపనూనె పురుగుల ఉద్ధృతి ఎక్కువగా ఉన్నప్పుడు నివారణకు రెండు మి.లీ. ఫిప్రోనిల్ లేదా 0.2 గ్రాములు ఎసిటామిప్రిడ్ లేదా 0.3 గ్రాములు ఫ్లూనికామిడ్ లేదా 0.75 మి.లీ. సల్ఫాక్సాఫ్లోర్ మందును 5 మి.లీ. 1500 పీపీఎం వేపనూనెతోపాటు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు పత్తిలో గులాబీ రంగు పురుగు ఆశించేందుకు అనుకూలం. నివారణకు పొలం గట్ల మీద ఉన్న వయ్యారిభామ కలుపును తొలగించాలి. ఎకరాకు 8 నుంచి 10 లింగాకర్షక బుట్టలు అమర్చాలి.



? వరిపంటలో అగ్గితెగులు విపరీతంగా ఉంది. నివారణ మార్గాలను వివరించగలరు. - వాంకుడోతు వీరయ్య, గార్ల

◆ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వరిలో అగ్గితెగులు సోకేందుకు అనుకూలం. తెగులు గమనించినట్లయితే నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథైయోలిన్ 1.5 మి.లీ. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లేదా ట్రైసైక్లోజోల్, మ్యాంకోజెబ్ మిశ్రమ మందును 2.5 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. –మధిర, న్యూస్‌టుడే



వాట్సప్ నెంబరు: 76750 50041

పెరట్లో అరటి వనం

ఏపుగా పెరిగిన అరటి మొక్కలు.. నోరూరించే అరటి గెలలు.. పదుల సంఖ్యలో ఉన్న అరటి మొక్కలను చూసి ఇదేదో పొలంలో వేసిన అరటి తోట అనుకుంటే పొరపాటే. వైరా ఆర్టీసీ బస్టాండ్ కూడలికి దూరంలో ఉన్న బ్రాహ్మణపల్లికి చెందిన పోటు మధు తన ఇంటి ఆవరణలో ఉన్న సుమారు మూడు కుంటల స్థలంలో పెంచిన అరటి మొక్కలివి. పోటు మధు గతంలో తన ఐదెకరాల పొలంలో అరటి సాగు చేశారు. కొన్నేళ్ల అనంతరం ఆ సాగుకు దూరంగా ఉంటున్నప్పటికి తన అభిరుచి మేరకు ఇంటి ముందు ఖాళీ స్థలంలో రెండేళ్ల క్రితం 150కి పైగా అరటి మొక్కలు నాటారు. పొలంలో ఉన్న మాదిరిగానే అవి ఏపుగా పెరిగి ఎంచక్కా అరటి కాపు కాస్తున్నాయి. ఏడాదికి ఒక కాపు కాసినప్పటికి వాటిని తన స్నేహితులు, బంధువులకు పంచుతున్నారు. మిగతా నామ మాత్రపు ధరకు అమ్ముతున్నారు.
- వైరా, న్యూస్‌టుడే



పెరట్లో అరటి సాగు చేసిన పోటు మధు.. ఇంటి ఆవరణలో గుంపుగా పెరిగిన అరటి చెట్లు

ఇలాగైతే దాతలు ముందుకొస్తారా?



మధిర పట్టణంలోని స్మృతివనంలో తాత్కాలిక షెడ్డులో ఉంచిన శీతలీకరణ శవపేటిక గత నెలలో భారీ వర్షాలు, వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది. కొద్దిదూరంలో ఉన్న చెట్లకు పట్టుకొని ఆగింది. చాలా రోజులు అలాగే ఉండిపోయిన ఫ్రీజర్‌ను కొద్ది రోజుల క్రితం పురపాలక సిబ్బంది తీసుకొచ్చి ఆరుబయట గడ్డిలో ఇలా నిర్లక్ష్యంగా వదిలేశారు. సాధారణ పరిస్థితులు నెలకొని నెల రోజులవుతున్నా దానికి మరమ్మతులు చేసి భద్రపరచాలని ఆలోచన చేయటం లేదు. మధిరకు చెందిన దాత తన సతీమణి జ్ఞాపకార్థం దాదాపు రూ.7 లక్షలతో అంతిమ యాత్రకు వినియోగించే వాహనంతోపాటు ఈ ఫ్రీజర్‌ను అందజేశారు. మున్సిపల్ మేనేజర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ వెంటనే సిబ్బందిని పంపి ఫ్రీజర్‌ను భద్రపరుస్తామన్నారు. మధిర, న్యూస్‌టుడే

బాధిత కుటుంబాలకు 'ఉపాధి' మార్గం

స్పందనకు వందనం

ఈనాడు, ఖమ్మం, తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: రఘునాథపాలెం మండలం ఉదయ్‌నగర్‌కి చెందిన భాగ్యమ్మ దీనావస్థపై 2024 ఆగస్టు 8న 'పేరులోనే భాగ్యం.. జీవనం దుర్భరం' శీర్షికన, తిరుమలాయపాలెం మండలం బంధంపల్లికి చెందిన బోడ నరేశ్ అవస్థలపై ఈఏడాది జనవరి 29న 'ఊతమిస్తేనే ఇల్లు గడిచేది' శీర్షికన 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ప్రవాస భారతీయుల స్వచ్ఛంద సేవా సంస్థ 'హోప్-4 స్పందన' స్పందించింది. న్యూజెర్సీకి చెందిన డా.బొమ్మన సత్యవేణి అందజేసిన రూ.1.50లక్షలతో ఉదయ్‌నగర్‌లో భాగ్యమ్మ కుటుంబానికి, అమెరికాలో ఉంటున్న సూరంపల్లి రత్నమ్మ-ఆగయ్య దంపతులు అందించిన రూ.1.50లక్షలతో బంధంపల్లిలో నరేశ్ ఉపాధి కోసం కిరాణ దుకాణాలను సంస్థ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. వీటిని స్వచ్ఛంద సంస్థ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త అరికపూడి రఘు సోమవారం ప్రారంభించారు. సంస్థ సభ్యుడు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


కిరాణ దుకాణం వద్ద అరికపూడి రఘుతో భాగ్యమ్మ, కుటుంబ సభ్యులు


బంధంపల్లిలో దుకాణాన్ని ప్రారంభిస్తున్న అరికపూడి రఘు

ఒకే ఇంట్లో ఇద్దరికి మెడిసిన్ సీట్లు

వైరా, న్యూస్‌టుడే: ఒకే ఇంట్లో అక్కా, తమ్ముడు ఉచిత మెడిసిన్ సీట్లు సాధించారు. వైరా శాంతినగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కంటెపుడి యెహోన్, కృష్ణవేణి దంపతుల కుమార్తె జాహ్నవి కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో, కుమారుడు శ్యామ్‌కుమార్ ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉచిత సీట్లు సాధించారు. ఈ మేరకు పలువురు వారిని అభినందించారు.


తల్లిదండ్రులతో జాహ్నవి, శ్యామ్‌కుమార్

గ్రామ పంచాయతీలకు తీపి కబురు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని 589 గ్రామ పంచాయతీలకు స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ కింద ప్రభుత్వం రూ.8.50 కోట్ల నిధులు విడుదల చేసింది. వీటిని ఇటీవల ఆయా గ్రామ పంచాయతీల ఖాతాలకు జమ చేయాలని కోరుతూ డీపీఓ ఆశాలత జిల్లా ఖజానా అధికారికి లేఖ రాశారు. దీంతో జిల్లా ఖజానా కార్యాలయం నుంచి అన్ని గ్రామ పంచాయతీల ఖాతాలకు నిధులు జమ చేశారు. గ్రామ పంచాయతీల్లోని ట్రాక్టర్లకు సంబంధించి బ్యాంకులకు చెల్లించాల్సిన రుణ వాయిదా సొమ్ము(ఈఎంఐ), విద్యుత్తు బిల్లులు, స్వచ్ఛదనం - పచ్చదనం పనులకు, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలోని 2,336 మంది మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాల కోసం రూ.2,37,87,726, ట్రాక్టర్ల ఈఎంఐలకు రూ.1,06,59,479, విద్యుత్తు బిల్లులకు రూ.1,90,99,000, స్వచ్ఛదనం-పచ్చదనం పనులకు రూ.3,14,99,076, మొత్తం రూ.8,50,45,281 నిధులు గ్రామ పంచాయతీల ఖాతాలకు జమ చేశారు.

జిల్లా ఖజానా అధికారిగా నరసింహ

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: జిల్లా ఖజానా అధికారిగా(డిప్యూటీ డైరెక్టర్) నియమితులైన ఎస్‌వీఎస్ నరసింహ సోమవారం కలెక్టరేట్‌లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో జాయింట్ డైరెక్టర్(ఫైనాన్స్)గా పని చేస్తున్న నరసింహను ఖమ్మం డీటీఓగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జిగా పని చేసిన మహబూబాబాద్ జిల్లా డీటీఓ వెంటపల్లి సత్యనారాయణ రిలీవ్ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన నరసింహకు ఎస్టీఓ వేలాద్రి సహా కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు. అనంతరం ఆయన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రిలీవై వెళుతున్న డీటీఓ సత్యనారాయణను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శాలువా కప్పి సత్కరించి వీడ్కోలు పలికారు.


నరసింహకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగులు

రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపురం హవేలీ, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్‌లకు సంబంధించి తెలంగాణ పోలీసుశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు సీపీ సునీల్‌దత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారి త్యాగాలను స్మరిస్తూ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపేలా ఉండే ఇటీవల తీసిన 3 ఫొటోలు, 3 నిమిషాల నిడివి ఉన్న లఘుచిత్రంగా తీసి ఈనెల 20వ తేదీ లోపు ఖమ్మం కమిషనరేట్ కార్యాలయంలో పోలీసు పీఆర్‌ఓకు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 87126 59256 చరవాణి సంఖ్యకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

లైన్‌మెన్ సస్పెన్షన్

చింతకాని, న్యూస్‌టుడే: లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతు గూని ప్రసాద్(55) స్ప్రేయర్ సహాయంతో మందు పిచికారి చేస్తూ విద్యుదాఘాతంతో శనివారం పంట పొలంలోనే మృత్యువాత పడిన విషయం తెలిసిందే. రైతు మృతిపై విద్యుత్తు అధికారులు రెండు రోజులపాటు క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారు. ఘటనకు బాధ్యుణ్ని చేస్తూ జూనియర్ లైన్‌మెన్ విజయ్‌కుమార్‌ను అధికారులు సస్పెండ్ చేశారు.

చెల్లని చెక్కు కేసులో 3 నెలల జైలు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో ఖమ్మం నగరానికి చెందిన ఎం.సురేందర్‌కు 3 నెలల జైలుశిక్ష విధించారు. ఫిర్యాదుదారు వై.వేణుగోపాలరావుకు రూ.6.20 లక్షలు చెల్లించాలని ఆదేశించారు. ఈ మేరకు 2023 ఫిబ్రవరి 15న ట్రయల్ కోర్టు వెల్లడించిన తీర్పును జిల్లా జడ్జి జి.రాజగోపాల్ ఖరారు చేస్తూ నిందితుడి అప్పీల్‌ను సోమవారం డిస్మిస్ చేశారు. ఫిర్యాదుదారు తరపున న్యాయవాది వై.నాగేశ్వరరావు వాదించారు.

'ఆయిల్‌పామ్' ప్రోత్సాహక రాయితీ అందించండి

సత్తుపల్లి: ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించిన ప్రోత్సాహక రాయితీని అందించాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ జోన్ ఆయిల్‌పామ్ గ్రోవెర్స్ సొసైటీ బాధ్యులు మహేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అప్పారావు కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు సోమవారం విన్నవించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సహిస్తున్నా మూడేళ్లుగా రాయితీలు సక్రమంగా అందడం లేదని వివరించారు.

మణుగూరులో జీవీ మాల్ ప్రారంభం

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: జీవీ మాల్‌లో లభించే వస్త్రాలకు ప్రత్యేకత ఉంటుందని సినీనటి అనసూయ అన్నారు. మణుగూరులో జీవీ మాల్‌ను సోమవారం ప్రారంభించారు. అనంతరం నూతన దుస్తులను ఆమె పరిశీలించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మణుగూరులో జీవీమాల్ షోరూంను ప్రారంభించటం హర్షణీయమన్నారు. షోరూం అధినేతలు గుర్రం ఉమామహేశ్వరరావు, నరేన్ మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి అందుబాటు ధరల్లో దుస్తులు లభిస్తాయని తెలిపారు. అనసూయను చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.


జీవీ మాల్‌లో నూతన దుస్తులను పరిశీలిస్తున్న సినీనటి అనసూయ, చిత్రంలో నిర్వాహకులు, తదితరులు

త్రుటిలో తప్పిన ప్రమాదం


అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లిన వాహనం

తల్లాడ, న్యూస్‌టుడే: ఆర్టీసీ విజిలెన్స్ అధికారులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీ బస్సుల్లో పొరుగు రాష్ట్రాలకు మద్యం సరఫరా అవుతుందనే సమాచారంతో ఏపీ విజయవాడకు చెందిన విజిలెన్స్ అధికారులు తల్లాడ రింగురోడ్డు కూడలిలో సోమవారం బస్సులను తనిఖీ చేశారు. అనంతరం కల్లూరు వైపు బొలెరో వాహనంలో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం తల్లాడ సమీపంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొని అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో వాహనంలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు బి.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పొదల్లోకి దూసుకెళ్లిన వాహనాన్ని ట్రాక్టర్ సాయంతో బయటకు తీశారు.

ఫుట్‌బాల్ విజేత ఖమ్మం

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సంబరాల్లో భాగంగా ఈ నెల 5న ప్రారంభమైన రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర ఫుట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి వాసిరెడ్డి నరేశ్‌కుమార్ పర్యవేక్షణలో కొత్తగూడెం ప్రకాశం మైదానం, పాల్వంచ నవభారత్ మైదానంలో గత మూడు రోజులుగా పోటీలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. పది ఉమ్మడి జిల్లాల జట్లు మ్యాచ్‌లలో తలపడ్డాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి జట్లు నిలిచాయి. విజేత జట్లకు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడల పరిశీలకుడు వడ్డెన్న ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, ఖదీర్, మంగీలాల్, మదన్‌మోహన్, కృష్ణ, రాము, యుగంధర్, శ్రీనివాస్, సుందరమ్మ, సీతాదేవి, సుజాత పాల్గొన్నారు.



హక్కుల సాధనకు సమరశీల పోరాటాలు

ఖమ్మం మామిళ్లగూడెం: మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలుచేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఐద్వా 12వ మహాసభ ఖమ్మం నాగార్జున వేడుకల మందిరంలో సోమవారం నిర్వహించారు. తొలుత ఇందిరానగర్‌లోని సత్తెనపల్లి రామకృష్ణ భవన్‌లో జెండాను జిల్లా మాజీ కార్యదర్శి ఏపూరి జయమ్మ ఆవిష్కరించారు. అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ, మెరుగు రమణ, మెహరున్నీసా, బేగం అధ్యక్షవర్గంగా కొనసాగిన మహాసభలో రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల సాధికారత, 33 శాతం రిజర్వేషన్ల అమలు, హక్కులపై మాటలు తప్ప చేతల్లో ఏమి చేయడం లేదని ఆరోపించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి మూడేళ్లుగా జిల్లాలో ఐద్వా చేసిన పోరాటాలు, భవిష్యత్తు కార్తవ్యాలు, ఉద్యమ నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. మహాసభలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ అఫ్రోజ్ సమీనా, నాయకులు నాగసులోచన, ప్రభావతి, కృష్ణవేణి, రజిత, పకీరమ్మ, సునీత, అమరావతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా నాయకులు, కార్యకర్తల ప్రదర్శన

శిక్షకుల్లో ఆసక్తి అంతంతే!

ఆత్మరక్షా ప్రశిక్షణ్‌కు 46 దరఖాస్తులు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

బాలికలను ఆత్మరక్షణ విద్యల్లో తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షా ప్రశిక్షణ్ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందుకోసం కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో బ్లాక్‌బెల్ట్ పొందినవారిని శిక్షకులుగా ఎంపిక చేసే బాధ్యత జిల్లా యువజన క్రీడల శాఖకు అప్పగించారు. పథకం అమలు, పర్యవేక్షణ విద్యాశాఖ చూస్తోంది. ఎంపికైన శిక్షకులు మూడు నెలల పాటు విద్యార్థులకు ఆత్మరక్షణ శిక్షణ అందించాలి. ఇందుకోసం శిక్షకుడికి నెలకు రూ.5 వేలు గౌరవ వేతనం అందించనున్నారు. జిల్లాలో 231 ఉన్నత, 6 ప్రాథమికోన్నత పాఠశాలల్లో శిక్షణ నిమిత్తం ప్రభుత్వం రూ.35.55 లక్షలు మంజూరు చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా మాకు అర్హత ఉంది, శిక్షకులుగా పని చేస్తామని ముందుకొచ్చిన వారి సంఖ్య 46కే పరిమితమైంది.



కావాల్సింది 237 మంది..


ఒక్కో పాఠశాలకు ఒక్కో శిక్షకుడు వెళ్లి శిక్షణ ఇవ్వాలంటే 237 మంది కావాలి. అవసరానికి, ముందుకు వచ్చిన వారి సంఖ్యలను పోల్చుకుంటే పొంతన కుదరడం లేదు. వారానికి మూడు, నెలలో 12 శిక్షణ తరగతులు తీసుకోవాలనే నిబంధన ఉంది. ఒక్కో శిక్షకుడు తన సౌలభ్యాన్ని బట్టి రెండు నుంచి మూడు పాఠశాలల్లో శిక్షణ ఇచ్చేందుకు అనుమతించాలని దరఖాస్తు చేసుకున్న వారు కోరుతున్నట్టు సమాచారం. అర్హులైన శిక్షకుల సంఖ్య తగినంతగా లేనందున ఇదే పద్ధతిలో అనుమతించే అవకాశం లేకపోలేదు. మహిళా శిక్షకులకు ముందుగా ప్రాధాన్యం ఇవ్వాలనే నిబంధన ఉంది. మహిళా శిక్షకుల సంఖ్య నామమాత్రంగా ఉంది. శిక్షకుల ఎంపిక బాధ్యత మాకిచ్చారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన జాబితాను విద్యాశాఖకు అందించామని జిల్లా యువజన క్రీడల అధికారి సునీల్‌రెడ్డి చెప్పారు.

విషాహారం తిని కోతులు మృతి?


కోతి కళేబరాన్ని తట్టిలేపేందుకు యత్నిస్తున్న పిల్లకోతి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: విషాహారం తిని కోతులు మృతి చెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. కిష్టారం లారీ అసోసియేషన్ ఆఫీస్ సమీపంలో పది కోతుల వరకు మృతి చెంది పడిఉన్నాయి. ఓ తల్లి కోతి కళేబరాన్ని పిల్లకోతి తట్టిలేపుతూ ఉన్న దృశ్యం వీక్షకులను కలిచివేసింది. విషం కలిపిన ఆహారాన్ని పెట్టడంతోనే కోతులు మృతి చెందాయని, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని భాజపా ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఘటనా స్థలికి వెళ్లి అప్పటికే ఖననం చేసిన కోతుల కళేబరాలను వెలికితీయించారు. సత్తుపల్లి స్టేషన్‌లో ఈ ఘటనపై ఫిర్యాదు చేశారు. జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, భాస్కర్ని వీరంరాజు, ఆచంట నాగస్వామి, పాలకొల్లు శ్రీనివాస్, గణేశ్‌గౌడ్, శేషగిరిరావు, శివ పాల్గొన్నారు.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142, విత్ స్కిన్ - 206, స్కిన్‌లెస్ - 234.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)	పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
	కొత్తపత్తి	6,000	7,011	6,700
	పాతపత్తి	7,200	7,450	7,400
	పెసలు	4,000	7,250	6,625
	కందులు	5,200	9,200	9,000
	ఏసీ ఎండుమిరప	10,000	19,800	16,900
	ఎండుమిరప	9,000	16,500	15,700

సత్తుపల్లి
•సత్తుపల్లి •మధిర •వైరా

ఆలయ నిర్మాణానికి రూ.25,116 విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక ద్వారకాపురికాలనీ-7 వీధిలో నూతనంగా నిర్మిస్తున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయానికి కొత్తగూడెం పట్టణానికి చెందిన గుగులోతు భీముడు, సుజాత దంపతులు సోమవారం రూ.25,116 విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణ బాధ్యుడు బ్రోణంరాజు మల్లికార్జునశర్మ, ట్రస్ట్ చైర్మన్ సోమిశెట్టి శ్రీధర్‌కు ఈ మొత్తం అందజేశారు. శాశ్వత చైర్మన్ రాగాల చంద్రారెడ్డి, గాదె నాగ, కొండేటి రాగాల రమేశ్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మిరప తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ఏన్కూరు, న్యూస్‌టుడే: సరైన యాజమాన్య పద్ధతుల ద్వారా మిరప సాగులో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందని వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సోమవారం జన్నారంలోని మిరప తోటలను పరిశీలించారు. తొలి దశలోనే తెగుళ్లను గుర్తించి సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కేవీకే వైరా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్త మీసేవం ఫణిశ్రీ, వైరా ఏడీఏ కరుణశ్రీ, ఏఓ నరసింహారావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: కల్లూరు పట్టణం ఎన్నెస్పీ క్రాస్‌రోడ్డు ఎస్సీ కాలనీలో చెత్తాచెదారం పేరుకుపోతోంది. - పాఠకుడు

సమాధానం: త్వరలో చెత్తను తొలగిస్తాం. నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి
- కల్లూరు, న్యూస్‌టుడే

మంగాపురం గ్రామానికి వెళ్లే రహదారి పక్కన చెత్త, వ్యర్థాలను పడేస్తున్నారు. - నరసింహారావు, తల్లాడ

✔ రహదారి పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. - కృష్ణారావు, ఈఓ.

గ్రామంలోని మంచినీటి పథకం వద్ద పిచ్చిమొక్కలు పెరిగిపోవటంతో ఇబ్బందవుతోంది. - సైదులు, మల్లవరం

✔ రెండు రోజుల్లో తొలగించి శుభ్రం చేయిస్తాం. - సిద్దీమియా, కార్యదర్శి
- తల్లాడ, న్యూస్‌టుడే

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

కారేపల్లి, న్యూస్‌టుడే: కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో ఈనెల 12 నుంచి నిర్వహించే శ్రీకోటమైసమ్మ జాతరలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఏసీపీ తిరుపతిరెడ్డి సూచించారు. జాతర ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. గత ఏడాది సమస్యలు పునరావృతం కాకుండా రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. వాహనాలను ఆలయానికి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో ఆపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవో వేణుగోపాలాచార్యులు, చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, ఉత్సవాల కమిటీ మగాలు మోహన కృష్ణ, సాయి, సీఐ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

'రహదారి మరమ్మతులు కరవు'

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: వరదలకు కోతకు గురైన తొండలగోపవరం- మీనవోలు రహదారికి నేటికీ మరమ్మతులు చేపట్టలేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శీలం నర్సింహారావు, మండల కార్యదర్శి మందా సైదులు పేర్కొన్నారు. సోమవారం కోతకు గురైన రహదారిని పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి మరమ్మతులు చేయిస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. నాయకులు ఊట్ల శంకర్‌రావు, తేలప్రోలు రాధాకృష్ణ, విల్సన్, చేబ్రోలు బాబురావు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలు.. ప్రారంభమయ్యేదెన్నడు?

కల్లూరు, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైనవే పల్లె దవాఖానాలు. ఆరోగ్య ఉపకేంద్రాల స్థాయి పెంచి ఎంబీబీఎస్ వైద్యుని సాయంతో సేవలందించేలా వీటి రూపకల్పన చేశారు. దవాఖాన పరిధిలో 5వేల మంది ప్రజలకు సేవలందించాలన్నది లక్ష్యం. కల్లూరు మండలంలో భవన నిర్మాణాలు అందుబాటులోకి రాకపోవటంతో పూర్తి స్థాయి సేవలందక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా పురపాలకం తరహా జనాభా ఉన్న కల్లూరు మండల కేంద్రంలో రెండు భవనాలూ ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు.

కల్లూరు మండలంలో మొత్తం ఆరు పల్లె దవాఖానాలున్నాయి. మొదట వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వీటిని పుల్లయ్య బంజర గ్రామంలో సొంత భవనంలోనే సేవలందిస్తున్నాయి. ఏడాదిన్నర క్రితం చెన్నూరు, పెద్ద కోరుకొండి గ్రామాలతోపాటు కల్లూరు మండల కేంద్రంలోని పుల్లయ్య బంజర రోడ్డు (ఏ సెంటర్), ఎన్నెస్పీ క్రాస్‌రోడ్డు(బి సెంటర్)లో మొత్తం నాలుగు పల్లె దవాఖానాలు మంజూరయ్యాయి. రూ.20 లక్షలతో ఒక్కో కేంద్రంలో భవన నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభమైనా ఇంకా అందుబాటులోకి రాలేదు. ఎన్నికల నోటిఫికేషన్ రావటం, ప్రభుత్వం మారటం, అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవటం తదితర కారణాలు ప్రతిబంధకాలుగా మారాయి.

1. పెద్దకోరుకొండిలో స్లాబ్ నిర్మాణం పూర్తయింది. కిటికీలు, తలుపులు ఇంకా ఏర్పాటు చేయలేదు. దాదాపు 30 శాతం పనులు పూర్తి కావల్సి ఉంది.
2. చెన్నూరులో చాలా వరకు పనులు పూర్తయ్యాయి. తలుపులు, కిటికీల ఏర్పాటు, రంగులద్దే పనులు మిగిలాయి.
3. కల్లూరు పట్టణంలోని రెండుచోట్లా దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మిగిలిన పనులు పూర్తిచేసి వైద్యశాఖకు అప్పగిస్తామని పీఆర్ డీఈ రావిలాల రాంబాబు పేర్కొన్నారు.

కల్లూరు 'ఏ' కేంద్రం పరిధి

కల్లూరు శివారులో వడ్డెర కాలనీ, వేణుగోపాలస్వామి దేవాలయం బజార్, ముత్యాలమ్మ గుడి ఏరియా, ఎల్లంకి ఎస్టేట్ తదితర ప్రాంతాలు.

'బి' కేంద్ర పరిధి

ఎన్నెస్పీ క్రాస్‌రోడ్డు, ఖాన్‌ఖాన్‌పేట, నారాయణపురం, గోకవరం, శ్రీరామ్‌పురం తదితర ప్రాంతాలు.


దాదాపు పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పల్లె దవాఖాన

పేదలకు ఇబ్బందులు..

మురికివాడలు, శివారు కాలనీల్లో ఉండే వారికి ప్రాథమిక వైద్యం అందుబాటులో తేవాలన్నదే పల్లె దవాఖానాల ఏర్పాటు ప్రధాన ఉద్దేశాల్లో ఒకటి. కల్లూరు జనాభా సుమారు 40 వేలు. నేటికీ ఆరు పడకల సామర్థ్యం ఉన్న పీహెచ్‌సీ మాత్రమే ఇక్కడ అందుబాటులో ఉంది. తరచూ వ్యాధుల కాలంలో సరిపడా బెడ్లు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ జేబులు గుల్లచేసుకుంటున్నారు. పేదలు రూ.వేలు వెచ్చించే స్తోమతలేక తమవంతు వచ్చేదాకా నిరీక్షిస్తున్నారు. మూడు నెలల క్రితమే పల్లె దవాఖానాల నిర్మాణ పనులు కొలిక్కి వచ్చినా ముందడుగు పడటం లేదు. సొంత గూడు లేకపోవటంతో సిబ్బంది పీహెచ్‌సీలో ఉంటూ, ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ సేవలందిస్తున్నారు. పీఆర్ అధికారులు త్వరగా పనులు పూర్తి చేయించి వైద్య శాఖకు భవనాలు అప్పగించాలని స్థానికులు కోరుతున్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం

తల్లాడ, న్యూస్‌టుడే: చివరి ఆయకట్టు భూములకు సాగునీరందించి పంటలు ఎండిపోకుండా కాపాడుతామని శాఖ డీఈ వి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం బస్వాపురం మేజర్ కాలువను పరిశీలించారు. కాలువకు అడ్డుగా ఉంచిన రేకులు, చెక్కలను సిబ్బందితో తొలగించారు. నీరు కిందకు వెళ్లకుండా అడ్డుకోవద్దని రైతులకు తెలిపారు. ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాలువ 8వ కిలోమీటరు వరకు నీటిపారుదలను పరిశీలించారు. ఏఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


కాలువను పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాసరావు

అన్నదాతకు వి'పత్తి'



ఈ ఏడాది అధిక వర్షాలతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నెల రోజులపాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో ఆ పంట ఎర్రబారి వాడిపోతుంది. రేపల్లెవాడలో ఓ పొలం తేమ శాతం పెరిగి పూర్తిగా ఎర్రబారింది. చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పూత, పిందె దశలో పంట దెబ్బతినడంతో చేసిన పెట్టుబడులను తలుచుకుంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. - ఏన్కూరు, న్యూస్‌టుడే

కోర్టు భవనం.. ఇక పాత జ్ఞాపకం



నిజాం ప్రభుత్వ హయాంలో 94 ఏళ్ల క్రితం మధిర పట్టణంలో నిర్మించిన భారీ కోర్టు భవనం కనుమరుగు కానుంది. 1930లో పట్టణ నడిబొడ్డున దాదాపు 4 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించారు. 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహించారు. 1978 వరకు సత్తుపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు ఈ కోర్టు పరిధిలోనే ఉండేవి. ఆ తర్వాత సత్తుపల్లిలో కోర్టు మంజూరు కావడంతో ఆ గ్రామాలు సత్తుపల్లికి బదిలీ అయ్యాయి. కోర్టు భవనం ప్రస్తుతం కొద్దిపాటి వర్షానికే కురుస్తుంది. ఏడాది క్రితం పశువుల ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన రైతు శిక్షణ భవనంలోకి మార్చారు. నూతన భవనానికి ప్రభుత్వం రూ.24 కోట్లు మంజూరు చేసింది. త్వరలో పాతది తొలగించి సముదాయాన్ని నిర్మించనున్నారు. - మధిర, న్యూస్‌టుడే

ప్రజావాణికి స్పందన కరవు



ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి స్పందన కరవైంది. 90 శాతం భూ సంబంధ సమస్యలే వస్తున్నాయి. ప్రభుత్వ శాఖలు 30వరకు ఉన్నా వాటికి సంబంధించిన ఫిర్యాదులేవీ అందడం లేదు. దీంతో వివిధ శాఖల అధికారులు ఖాళీగా కూర్చుంటున్నారు. గత వారం ఒకటి, ఈ సోమవారం నాలుగు సమస్యలు రాగా వీటిలో ఒకటి మినహా అన్నీ భూ వివాదాలే. ఇప్పటివరకు ఆరుసార్లు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొదటి సోమవారం 30 సమస్యలు రాగా వాటిలో 28 భూసంబంధమైనవే. మిగిలిన అయిదు వారాల్లో కేవలం 20 సమస్యలే వచ్చాయి. దీనిపై తహసీల్దారు ఎమ్‌ఏ రాజు మాట్లాడుతూ మిగిలిన సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. - వేంసూరు, న్యూస్‌టుడే

యరమలకు ఎంపీ నివాళి


యరమల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రఘురాంరెడ్డి

తల్లాడ, న్యూస్‌టుడే: రంగాపురం గ్రామంలో సోమవారం మాజీ సర్పంచి యరమల వెంకటేశ్వరరెడ్డి దశదిన కర్మకు ఖమ్మం పార్లమెంటు సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి హాజరయ్యారు. యరమల చిత్రపటానికి నివాళి అర్పించారు. నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయబాబు, వైరా మున్సిపల్ ఛైర్మన్ జైపాల్, నాయకులు మట్టా దయానంద్, నల్లమల వెంకటేశ్వరరావు హాజరయ్యారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తలూరి ప్రసాద్‌కు మాతృ వియోగం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లిలోని చిత్తలూరి తంబీ ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమ అధ్యక్షురాలు, పీఆర్‌టీయూ రాష్ట్ర నేత చిత్తలూరి ప్రసాద్ మాతృమూర్తి వీరమ్మ(76) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. డాక్టర్ మట్టా దయానంద్, బీసీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్, పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ రియాజుద్దీన్, జిల్లా కార్యదర్శి దారా ఏసురత్నం వీరమ్మకు నివాళి అర్పించారు.

దొడ్డా కృష్ణయ్య వర్ధంతి

తల్లాడ, న్యూస్‌టుడే: స్థానిక సీపీఎం కార్యాలయంలో దొడ్డా కృష్ణయ్య వర్ధంతి సభను సోమవారం నిర్వహించారు. గోపాలపేట మాజీ సర్పంచి నల్లమోతు మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు కృష్ణయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు.

కొణిజర్ల, న్యూస్‌టుడే: ప్రజా ఉద్యమాలను నిర్మించి పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రాబాబు పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు ఆకుతోట వెంకయ్య వర్ధంతి సోమవారం తనికెళ్లలో నిర్వహించారు.

చక్రాల కుర్చీ వితరణ

తల్లాడ, న్యూస్‌టుడే: బిల్లుపాడు గ్రామానికి చెందిన జక్కంపూడి కృష్ణమూర్తి-ప్రేమలత జ్ఞాపకార్థం కుమారుడు కిషోర్ దివ్యాంగుడు కోపెల్లి సుందరయ్యకు చక్రాల కుర్చీని సోమవారం పంపిణీ చేశారు.

ఏన్కూరు ఎస్సైగా మహ్మద్ రఫీ

ఏన్కూరు, న్యూస్‌టుడే: ఏన్కూరు ఎస్సైగా మహ్మద్ రఫీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఖమ్మం రెండో పట్టణ పోలీస్ ఠాణాలో పని చేస్తూ బదిలీ అయ్యారు. ఇంతకాలం ఇక్కడ పని చేసిన బాదావత్ రవికుమార్ సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మధిర: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిశోర్ సోమవారం అందజేశారు. తొమ్మిదిమందికి మొత్తం రూ.2.85 లక్షల చెక్కులు పంపిణీ చేశారు.

ఏకగ్రీవ ఎన్నిక



ఏన్కూరు: ఎమ్మార్పీ మెసెంజర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏన్కూరుకు చెందిన చింతనబోయిన రుద్రగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప్పల్‌లోని సంఘ కార్యాలయంలో సోమవారం ఈ ప్రక్రియ చేపట్టారు.


శబరిమలకు పాదయాత్ర



కల్లూరు, న్యూస్‌టుడే: పేరువంచ గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు మండవ వెంకటరామిరెడ్డి, పి.శ్రీనివాసరావులు శబరిమల సన్నిధానానికి పాదయాత్రగా సోమవారం బయలుదేరారు. జిల్లా అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ జిల్లా అధ్యక్షుడు కాటేపల్లి రజనీకాంత్ పాదయాత్ర ప్రారంభించారు.

చండీ రూపం.. బతుకమ్మ ఉత్సాహం

సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల్లోని పట్టణాలు, పల్లెల్లో దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాటుచేసిన మండపాల్లో అమ్మవారు చండీ రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వేళల్లో చిన్నారులు, యువతులు, మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆడిపాడారు.
- న్యూస్‌టుడే, యంత్రాంగం


తక్కెళ్లపాడులో చండీదేవి అవతారం


మధిర గ్రామీణం: సిరిపురం దేవాలయంలో..


చింతకాని పీహెచ్‌సీలో సిబ్బంది..


కల్లూరు ప్రధాన రహదారిలో అన్నాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు


తల్లాడ శ్రీకోటమైసమ్మ తల్లి దేవాలయ ఆవరణలో


మధిర: లడక్‌వీధిలో అమ్మవారి విగ్రహం వద్ద లింగాల కమల్‌రాజు


ముదిగొండ దేవాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు


జేవీఆర్ ఓసీలో పూజలు చేస్తున్న సింగరేణి కార్మికులు

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

ఏన్కూరు, న్యూస్‌టుడే: శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏన్కూరు కోదండ రామాలయంలో సోమవారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు, భవాని మాలధారులు కల్యాణాన్ని తిలకించారు. రాజరాజేశ్వరీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రాంగణంలో దీపాలంకరణ చేశారు.


ఏన్కూరు కోదండ రామాలయంలో పూజలు

తల్లాడ: తల్లాడలోని శ్రీహనుమత్ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, విష్వక్సేనారాధన, నిత్యహోమం, ఎదుర్కోలు ఉత్సవం కనుల పండువగా సాగింది.

సత్తుపల్లిలో హీరో షోరూం ప్రారంభం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ఖమ్మం శ్రీశ్రీశ్రీ ఆటోమొబైల్ ఆథరైజ్డ్ మైన్ డీలర్ వారిచే సత్తుపల్లి శివారు వసంత్ నగర్ వి కన్వెన్షన్ టవర్‌లో ఏర్పాటుచేసిన హీరో మోటోకార్ప్ లిమిటెడ్ హీరో షోరూంను తెలంగాణ ఏరియా మేనేజర్ మనీష్‌జైన్ సోమవారం ప్రారంభించారు. వర్క్‌షాప్‌ను ఏరియా సర్వీస్ మేనేజర్ దీపక్‌కుమార్‌రాజ్‌పుట్ ఆరంభించారు. సంస్థ ఎండీ ఈశ్వరప్రగడ ఉషారాణి, రంగనాథ్, హైకోర్టు అడ్వకేట్ ఈశ్వరప్రగడ హరిబాబు పాల్గొన్నారు.


షోరూంను ప్రారంభిస్తున్న ఏరియా మేనేజర్ మునీష్‌జైన్, సర్వీస్ మేనేజర్ దీపక్‌రాజ్‌పుట్ తదితరులు

దాడికి పాల్పడ్డ వ్యక్తిపై కేసు

పెనుబల్లి, న్యూస్‌టుడే: దాడికి పాల్పడ్డ వ్యక్తిపై కేసు నమోదైంది. మండాలపాడుకు చెందిన కోట నాగరాజు తన తోడల్లుడైన జుంజునూరి రవితో కలిసి ఎస్సీ కాలనీలోని దుకాణంలో సోమవారం శీతల పానీయం తాగుతున్నారు. అదే సమయంలో ఇడుపుల పాటి రాంబాబు దుకాణం వద్దకు వచ్చి నాగరాజు కుటుంబం గురించి చెడుగా మాట్లాడాడు. దీనిపై నాగరాజు ప్రశ్నిస్తే అసభ్యకర పదజాలంతో దూషిస్తూ సీసాతో నాగరాజును పొడిచి పారిపోయాడు. బాధితుణ్ని ఆసుపత్రికి తరలించారు.

ఇద్దరిపై కేసు నమోదు

చింతకాని, న్యూస్‌టుడే: కోమట్లగూడెం గ్రామానికి చెందిన యలమద్ది సుధాకర్‌రావుపై అదే గ్రామానికి చెందిన అవులూరి వెంకట్రామిరెడ్డి, రామకోటిరెడ్డి సోమవారం దాడిచేసి అసభ్య పదజాలంతో దూషించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ముదిగొండ: పెద్దమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను కమలాపురం వద్ద సోమవారం పట్టుకున్నట్లు ఆర్ఐ ప్రసన్నకుమార్ తెలిపారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు.

దేవాలయంలో చోరీ

కల్లూరు, న్యూస్‌టుడే: ఖాన్‌ఖాన్‌పేటలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఉత్సవ విగ్రహాలు చోరీకి గురైనట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పెద్దరాములు, జర్పన జగ్గయ్య తెలిపారు. సోమవారం తెల్లవారుజామున పంచలోహ ఉత్సవ విగ్రహాలు, మంగళ సూత్రాలు, స్వామివార్ల వెండికళ్లు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. వీటి విలువ రూ.2 లక్షలుంటుందన్నారు. ఎస్సై షాకీర్ కేసు నమోదు చేశారు.

సురక్షిత శిక్షణ

తాగునీటి సమస్యల పరిష్కారానికి మంచినీటి సహాయకులు

చింతకాని, న్యూస్‌టుడే

పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు పగిలి నీరు కలుషితమై ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. నీరు కూడా పెద్ద మొత్తంలో వృథా అవుతోంది. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ప్రతి గ్రామానికి ఓ బహుళ నైపుణ్యం కలిగిన కార్మికుణ్ని (మేజరు పంచాయతీలకు ఇద్దరు) ఎంపిక చేసి వారికి నాలుగు రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'నల్ జల్ మిత్ర' పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.


చింతకానిలో నీటి నాణ్యత పరీక్షల విధానాన్ని వివరిస్తున్న మిషన్ భగీరథ అధికారులు

● నియోజకవర్గం
● శిక్షణ పొందే కార్మికులు

మధిర	143
వైరా	149
సత్తుపల్లి	148

మంచినీటి సహాయకుల బాధ్యతేంటి?

శిక్షణ పొందిన మంచినీటి సహాయకులు నెలలో మూడుసార్లు తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయటం, పైపులైన్లకు మరమ్మతులు చేపట్టడంతోపాటు గ్రామస్థుల సమక్షంలో నీటి పరీక్షలు చేయాలి. బోర్లు, మోటార్లు పాడైతే అదే రోజు మరమ్మతులు చేపట్టాలి.

శిక్షణార్థులు? శిక్షణ కాలం?

మధిర, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల పరిధిలో 408 గ్రామాలకు చెందిన నైపుణ్య కార్మికులకు శిక్షణ ఇస్తున్నారు. సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 10 వరకు విడతల వారీగా మండల కేంద్రాల్లో శిక్షణ అందిస్తున్నారు. హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనీలు తర్ఫీదు ఇస్తున్నారు.

శిక్షణాంశాలు?

చేతిపంపులు, బోర్ల మరమ్మతులు, సింగిల్, త్రీఫేజ్ మోటార్ల నిర్వహణ, ప్యానెల్ బోర్డులు, నల్లాల మరమ్మతులు, పైపులైన్ల లీకేజీ మరమ్మతులు, కొత్తవి అమర్చటం, నీటి నాణ్యత పరీక్షలు, నీటి కిట్ల వినియోగంపై శిక్షణ ఇస్తున్నారు.

'గ్రామస్థాయిలోనే తాగునీటి సమస్యల పరిష్కారం కోసం సహాయకులకు శిక్షణ ఇస్తున్నాం. సురక్షిత తాగునీరు సరఫరా చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయం.'
- వై.శ్రీనివాసరావు, మిషన్ భగీరథ డీఈ

11న సమీకృత గురుకుల పాఠశాలలకు శంకుస్థాపన



ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాలకు మంజూరైన సమీకృత గురుకుల పాఠశాలల సముదాయ భవనాల నిర్మాణానికి 11న శంకుస్థాపన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తారని, నివేదికలు సిద్ధం చేయాలన్నారు. డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఈనెల 9న నియామక పత్రాలు అందిస్తారని, జిల్లా నుంచి 500 మందికి పైగా ఎంపికయ్యారని వారిని హైదరాబాద్ తరలించేందుకు బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు.

శాంతి కొనసాగించాలి

వైరా, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం వైరాలో నిరసన వ్యక్తం చేశారు. అరబ్ దేశాల్లో అమెరికా జోక్యం లేకుండా శాంతి విధానాలను ప్రోత్సహించాలని కోరారు. నాయకులు బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, కురుగుంట్ల శ్రీనివాస్‌రావు, జమాల్, మందడపు రామారావు, కొంగర సుధాకర్ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: పాలస్తీనాలో సాగుతున్న మారణ హోమాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య డిమాండ్ చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ రింగ్ కూడలిలో సోమవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

నంబర్ ప్లేట్ లేకుంటే కేసులు: ట్రాఫిక్ ఏసీపీ

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: నంబర్ ప్లేట్‌లేని వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో నగరంలోని నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న 55 ద్విచక్ర వాహనాలను పట్టుకున్నారు. వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి, వాహనాలను రాజాకు తరలించారు. ఏసీపీ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో గొలుసు దొంగతనాల నిందితులు పోలీసులు, సీసీ కెమెరాల నుంచి తప్పించుకునేందుకు ద్విచక్ర వాహనాల నెంబరు ప్లేట్లను తొలగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లయ్య, ట్రాఫిక్ సీఐ మోహన్ బాబు, టాస్క్‌ఫోర్స్ సీఐ రామకృష్ణ, ఆర్ఐ సాంబశివరావు, ఎస్సై రవి, సాగర్, రాము పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఖిల్లా బజార్ ఫీడర్ పరిధిలో మంగళవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జె.ప్రభాకర్‌రావు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. కస్బాబజార్, పాత ఖానా, పాత మున్సిపల్ ప్రాంతం, ఖిల్లా, శుక్రవారి పేట, లీలావ మసీదు, బ్రాహ్మణ బజార్, రిక్కాబజార్, చర్చ్ కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 వరకు సరఫరా ఉండదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 93944 50199
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

సమస్య: 15వ డివిజన్ కొత్తగూడెంలోని మా వీధిలో రెండు నెలలుగా కాలువలు తీయడం లేదు. చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. **- ఓ పాఠకుడు**

సమాధానం: రెండు రోజుల్లో శుభ్రం చేయిస్తాం: కె.మల్లయ్య, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

పూడిక తీయరు... మొక్కలు తొలగించరు!

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: విజయనగర్‌కాలనీలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం కనబడుతోందని స్థానికులు వాపోతున్నారు. నెల తరబడి రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించకపోవడం, కాలువల్లో పూడిక తీయకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కాలువ పూడిక తీత పనులు చేపట్టడంతోపాటు, రహదారుల్లో ఇరువైపులా గుబురుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



విజయనగర్‌కాలనీ మొదటి వీధికి ఇరువైపులా పెరిగిన గడ్డి మొక్కలు



కాల్వలో పేరుకుపోయిన పూడిక

నేడు ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఖమ్మం లోక్‌సభ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి నేడు జిల్లాలో పర్యటించనున్నారు. పలు నియోజకవర్గాల్లో బాధిత కుటుంబీకుల పరామర్శించడంతో పాటు బతుకమ్మ వేడుకలు, దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొంటారు.

ఇక్కడ బండి పెడితే గోవిందా..!

అధికారులకు తెలియకుండా పార్కింగ్ దందా

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో పార్కింగ్ స్టాండ్‌ల ఏర్పాటు విషయంలో అంతా మా ఇష్టం అన్న చందంగా మారింది. తమకు నచ్చినట్లుగా ధరలు ఏర్పాటు చేసుకొని, అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణం చేసి వ్యాపారం చేయడం సర్వసాధారణంగా మారిపోయింది. తాజాగా నగరంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమీకృత మార్కెట్‌లో ఈనెల 1వ తేదీ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు పార్కింగ్ స్టాండ్ ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇటు నగరపాలక సంస్థ అధికారులు, అటు మార్కెట్ అధికారుల అనుమతి లేకుండా మార్కెట్ ఆవరణలో షెడ్డు నిర్మించడంతో పాటు, ధరల పట్టిక ఏర్పాటు చేయడం విశేషం. నిత్యం వివిధ ప్రాంతాలకు ఉద్యోగాల నిమిత్తం బస్సుల్లో వెళ్లేవారు ఇక్కడ వాహనాలు పెట్టి వెళ్లేవారు. ఇది గమనించిన కొంతమంది మార్కెట్‌లోని వ్యక్తులు దీన్ని ఏర్పాటు చేసి ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



షెడ్డు నిర్మించి ఏర్పాటు చేసిన పార్కింగ్, ధరల పట్టిక

అనుమతి లేకుండానే...

ప్రభుత్వ కార్యాలయాలు, ప్రదేశాల ఆవరణలో పార్కింగ్ స్టాండ్ ఏర్పాటు చేయాలంటే సదరు శాఖ టెండర్ ప్రక్రియ ద్వారా నిర్వహిస్తుంది. లేదంటే కొటేషన్ పద్ధతిలో కేటాయిస్తుంది. కానీ పార్కింగ్ స్టాండ్‌ను ఎలా ప్రారంభించారన్న విషయం అంతు చిక్కడంలేదు. ఇదే సమయంలో తాత్కాలిక షెడ్ నిర్మాణం చేపట్టడం విశేషం. అయినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. నగరపాలక సంస్థ, మార్కెటింగ్ అధికారులు ఈ విషయంపై దృష్టి సారించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై సహాయ కమిషనర్ సంపత్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా పార్కింగ్ స్టాండ్ ఏర్పాటుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

'అవినీతి మిల్లర్లపై చర్యలు తీసుకోండి'

ఖమ్మం హవేలి, న్యూస్‌టుడే: పౌరసరఫరాల శాఖ అధికారుల అండదండలతో ఖమ్మం జిల్లా రైస్ మిల్లర్లు చేసిన భారీ అవినీతిని ప్రభుత్వం వెలికి తీసి చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో సోమవారం మాట్లాడారు. పౌరసరఫరాల శాఖ రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి, బియ్యం రూపంలో తిరిగి ఇవ్వాలని సీఎంఆర్ స్కీం పేరుతో జిల్లాలోని రైస్ మిల్లర్లకు ప్రభుత్వం అప్పగిస్తోందన్నారు. కానీ రైస్ మిల్లర్లు రెండేళ్లుగా ప్రభుత్వానికి బియ్యం అప్పగించకుండా, అక్రమంగా ఇతర రాష్ట్రాలకు అమ్ముకొని సుమారు రూ.900 కోట్లు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర సాహు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజు, పల్లెపొంగు విజయ్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెరుకుపల్లి నాగేశ్వరరావు

'ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తున్న ఇజ్రాయిల్'



అంబేడ్కర్ కూడలిలో వామపక్ష పార్టీ నేతల ప్రదర్శన

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఏడాదిగా యుద్ధం చేస్తున్న ఇజ్రాయిల్ ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తోందని వామపక్ష పార్టీల జిల్లా నేతలు ఆరోపించారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాత కలెక్టరేట్ ఎదుట ఉన్న ఆలమ్మ విగ్రహం వద్ద నుంచి అంబేడ్కర్ కూడలి వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. యుద్ధం వద్దు.. శాంతి ముద్దు అంటూ నినాదాలు చేశారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎన్డీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, వామపక్షాల నాయకులు యర్రా శ్రీకాంత్, జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రా బాబు, ఎస్‌కె.జానిమియా, శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉత్తర్వులు నిలిపివేత

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో బదిలీ ఉత్తర్వులు చివరి నిమిషంలో నిలిపివేశారు. సోమవారం పగలంతా బదిలీలపై కసరత్తు చేసిన అధికారులు తుది జాబితాను ప్రకటించకుండా ఆపారు. మంగళవారం ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి జిల్లాకు రానున్న నేపథ్యంలో జాబితాను ప్రకటించలేదు. ఆయన ఆదేశాల మేరకు ఉత్తర్వులను నిలిపివేశారు. సీఎండీ పరిశీలించిన అనంతరం జాబితా విడుదల చేసే అవకాశం ఉంది.

తలో చేయి వేసి.. రహదారి నిర్మించి..!



ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: వర్షాలు, వరదల ఉద్ధృతికి కొట్టుకుపోయిన రహదారి నిర్మాణం కోసం కాలనీవాసులంతా అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయారు. లాభం లేదనుకుని తలో చేయివేసి రహదారి నిర్మాణం చేపట్టారు. ఖమ్మం గ్రామీణ మండలం పెద్దతండా పంచాయతీ ఆర్‌ఎస్‌నగర్‌లో ఇటీవల రహదారి కొట్టుకుపోయి స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. కాలనీలో ఈ మార్గానికి అనుసంధానంగా మొత్తం 20 గృహాలు, ఇళ్ల స్థలాలున్నాయి. ఒక్కొక్కరు రూ.4,300ల చొప్పున రూ.95వేలతో మట్టి దారి నిర్మాణం చేపట్టారు. ఆర్‌ఎస్ నగర్‌కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కమిటీ సభ్యులు, సోమవారం ప్రారంభించారు. సీసీ మంజూరు చేయాలని కాలనీ వాసులు కోరారు.

పరిహారం కోసం ప్రదక్షిణలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మున్నేరు వరద బాధితుల్లో అనేక మంది నష్ట పరిహారం రూ.16,500 వారివారి ఖాతాల్లో జమ కాకపోవడంతో వారంతా నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొంతమంది డబ్బులు ఖాతాల్లో జమా అయినట్టు చూపిస్తున్నప్పటికీ రాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారంతా సోమవారం కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. బ్యాంకులకు పంపాల్సిన నివేదికలను వెంటనే పంపేందుకు చర్యలు తీసుకోవాలని సహాయ కమిషనర్ సంపత్‌కుమార్‌ను ఆదేశించారు.



మాదక ద్రవ్యాల నుంచి కాపాడమ్మా!



ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: ఆబ్కారీశాఖలో మహిళా ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది సోమవారం తమ కార్యాలయంలో బతుకమ్మ ఆడారు. 'డ్రగ్స్‌కు నో చెబుదాం' అంటూ బ్యానర్‌ను ప్రదర్శించారు. మాదకద్రవ్యాల కట్టడికి నిరంతరం పని చేస్తున్నట్టుగా పూలతో అలంకరించారు.

దివ్యాంగురాలికి చేయూత



వెంకటనర్సమ్మకు ఇప్పించిన సరకులతో అరికపూడి రఘు

ఈనాడు, ఖమ్మం: ఇటీవల మున్నేరు వరద ఉద్ధృతికి ఖమ్మం నగరం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వెంకటనర్సమ్మ కిరాణ దుకాణంలో సరకులు కొట్టుకుపోయాయి. 'హోప్ 4 స్పందన' అనే స్వచ్ఛంద సంస్థ తరపున ఆమెకు రూ.30 వేల కిరాణ సరకులను సంస్థ సమన్వయకర్త అరికపూడి రఘు సోమవారం అందజేశారు.

సమయపాలన పాటించకుంటే శ్రీముఖాలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సమయానికి హాజరు కాని వివిధ విభాగాల అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య సహాయ కమిషనర్ సంపత్‌కుమార్‌ను ఆదేశించారు. కమిషనర్ ఫిర్యాదులు స్వీకరిస్తున్న సమయంలోనే ఒకరిద్దరు అధికారులు లోపలకు రావడంతో ఇప్పుడు సమయం ఎంతైంది... ప్రజావాణి ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియదా? అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి ఆ విభాగాధిపతి, కంప్యూటర్ ఆపరేటర్లు ప్రజావాణికి రావాలని, సమస్యలను తక్షణమే పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులను ఆన్‌లైన్ చేసి వాటిని పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీ వికాస్, ఏసీపీ వసుంధర, ఏఎస్ఓ లింగయ్య, ఏడీఎంసీ సుజాత తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

కార్పొరేషన్ కబుర్లు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

- ప్రజారోగ్యశాఖలో ఏఈగా నియమితులైన డోన్‌వాన్ దివ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు.
- నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రం పక్కనే పాత మార్కెట్‌ను ఆధునికీకరించేందుకు రూ.41 లక్షలతో ప్రతిపాదనలు చేశారు.
- ఉర్దూఘర్‌ను మైనార్టీ సంక్షేమ నిధులు రూ.50 లక్షలతో ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు చేశారు.
- దానవాయిగూడెం డంపింగ్ యార్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిన కాలువపై రూ.6.87 లక్షలతో కల్వర్టు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశారు.

రాయిమీద పడి గ్రానైట్ కార్మికుడి మృతి

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రానైట్ పరిశ్రమలో రాయిమీద పడి కార్మికుడు మృతి చెందిన ఘటన వెంకటగిరిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన బబ్లూకుమార్(36) కొంతకాలంగా వెంకటగిరిలోని ఓ గ్రానైట్ పరిశ్రమలో పని చేస్తున్నారు. యంత్రంతో రాయిని కోస్తుండగా అది మీద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య విమలాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నరసింహాపురంలో సోమవారం చోటు చేసుకుంది. తల్లంపాడు శివారు నరసింహాపురం గ్రామానికి చెందిన ఉపేందర్, సుజాత దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పనికి వెళ్లడం లేదని ఆదివారం రాత్రి ఇంట్లో భార్యాభర్తలకు ఘర్షణ చోటు చేసుకుంది. మనస్తాపం చెందిన సుజాత సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: దానవాయిగూడెం వద్ద సాగర్ కాల్వలో దూకిన యువకుడి మృతదేహం సోమవారం వి.వెంకటాయపాలెం లాకుల వద్ద లభ్యమైంది. ఖమ్మం 7వ డివిజన్ శ్రీలక్ష్మీ నగర్ 35వ స్తంభం వీధికి చెందిన బూరిక రాకేశ్(23) హైదరాబాద్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. దసరా పండుగకు ఇంటికి వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులపై ఇంట్లో కుటుంబ సభ్యులతో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చేతికి వచ్చిన కొడుకు మరణించడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

కామేపల్లి, న్యూస్‌టుడే: అజాగ్రత్త, అతివేగంతో లారీని నడిపి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్ సైదులుపై కేసు నమోదు చేశామని ఎస్సై సాయి కుమార్ సోమవారం తెలిపారు. ఆదివారం పండితాపురం వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులు తేనె నాగయ్య, గుగులోతు రవి తీవ్రంగా గాయపడ్డారన్నారు. కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చోరీ ఘటనలో..: తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: వేర్వేరు ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు, వెండి ఆభరణాలు చోరీ చేసిన ఘటనపై ఠాణాలో సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కాకరవాయిలో ఈ నెల 4న కొత్తపల్లి సత్యం ఇంట్లో రూ.10 వేల నగదు, ఉపేంద్రమ్మ ఇంట్లో 15 తులాల వెండి పట్టీలు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు దసరా సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు, సామాజిక కార్యకర్త ఎస్‌డీఎల్ రాంబాబు తహసీల్దార్‌కు కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయండి

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని ఎమ్మార్పీఎస్, భారాస, ఎంఎస్‌పీ తదితర పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వివిధ గ్రామాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయించి, వాటిలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మండలాధికారులకు వినతిపత్రం అందించారు. నాగభూషణం, బాబు, మల్లయ్య, నాగేశ్వరరావు, కృష్ణ, పులే, రాంబాబు పాల్గొన్నారు.

'తరలింపు ప్రయత్నాలు విరమించుకోండి'

తిరుమలాయపాలెం: దశాబ్ద కాలంగా సుబ్లేడులో నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలుర వసతిగృహాన్ని అక్కడి నుంచి తరలించి మండలకేంద్రంలో నిర్వహించేందుకు చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని జేఏసీ ప్రజాసంఘాల నాయకుడు మందడి ఇజ్రాయేలు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందించారు.

సీపీఐ సీనియర్ నాయకుడి మృతి

ఖమ్మం గ్రామీణం: మద్దివారిగూడేనికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు బండి రామయ్య(96) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. పార్టీ రాష్ట్ర నాయకుడు మౌలాన, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ తదితరులు ఆయనకు నివాళులర్పించారు.

లఘుచిత్రానికి ప్రశంస

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలంగాణ షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో నగరానికి చెందిన జాన్‌పాషా రూపొందించిన 'ఓ మగువ' లఘుచిత్రానికి జ్యూరీ పురస్కారం, ప్రశంస దక్కాయి. ఈ పోటీల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలు లఘుచిత్రాలు పోటీపడగా నిర్మాత, నటుడు జాన్‌పాషా చిత్రానికి బహుమతి గెలుచుకుంది. ఈసందర్భంగా నిర్వాహకుల చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. పలువురు అభినందించారు.

రాజబహదూర్ సేవలు ప్రశంసనీయం

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: రాజ్యసభ సభ్యునిగా, ట్రేడ్ యూనియన్ నాయకుడిగా రాజ్‌బహదూర్ గౌర్ సేవలు ప్రశంసనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. గిరిప్రసాద్ భవన్‌లో 13వ వర్ధంతి సోమవారం నిర్వహించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్‌కె.జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింహారావు, కళావతి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాంబాబు జీవితం ఆదర్శప్రాయం



రాంబాబుకు చిత్రం బహూకరిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సాంస్కృతికం: జయవిలాసిని డెవలపర్స్ అధినేత కుంచపు రాంబాబు జన్మదిన వేడుకలు నగరంలోని ఓ ప్రైవేటు వేడుకల మందిరంలో సోమవారం నిర్వహించారు. మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌ఛార్జి దయాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని, భాగస్వామి సైదులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ప్రకాశ్‌నగర్‌లో శ్రీకనకదుర్గ ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం బాలు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మేయర్ నీరజ, ట్రస్ట్ ఛైర్మన్ బాలు పాల్గొన్నారు.

అవతారం.. నయనమనోహరం

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాలు నగరంలో కొనసాగుతున్నాయి. సోమవారం దేవాలయాలు, మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి. శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో శ్రీగజలక్ష్మీ అవతారం, గుట్టలబజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శ్రీమీనాక్షి దేవీ అలంకరణ చేశారు.

కామేపల్లి, న్యూస్‌టుడే: కెప్టెన్ బంజారలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మహాలక్ష్మి రూపంలో భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు.

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎంవీపాలెంలో రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద సోమవారం కుంకుమ పూజ నిర్వహించారు.

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లోని దేవినవరాత్రి ఉత్సవాల మండపాల వద్ద సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ గజ్జల లక్ష్మి వేర్వేరుగా పాల్గొన్నారు.



శ్రీస్తంభాద్రి ఆలయంలో గజలక్ష్మీ అలంకారం



జమ్మిబండపై అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



ఖమ్మం గ్రామీణం: ఎంవీపాలెంలో కుంకుమ పూజ

కార్మికుల నిరసన.. రోగుల యాతన

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఖమ్మం సర్వజనాసుపత్రి కాంట్రాక్టు కార్మికులు వేతనాల విడుదల కోసం విధులు బహిష్కరించారు. ఆస్పత్రికి చెందిన పేషెంట్ కేర్, పారిశుద్ధ్య, భద్రత విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు సోమవారం సమ్మెబాట పట్టారు. కార్మికుల వేతనాల చెల్లింపుల్లో పలుమార్లు సమస్యలు తలెత్తుతున్నా పట్టించుకునే వారు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పండగ పూట పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వేతనాలు పూర్తిగా చెల్లించే వరకు విధులు నిర్వహించేది లేదని స్పష్టం చేశారు.

రోగుల యాతన: కార్మికులు విధులు బహిష్కరించడంతో రోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సోమవారం కావడంతో ఓపీ రోగులతో కిక్కిరిసిపోయింది. సిబ్బంది అందుబాటులో లేక ఔట్ పేషెంట్ విభాగం వద్ద పేర్ల నమోదు ప్రక్రియ నత్తనడకన సాగింది. ఉదయాన్నే పలు రకాల జబ్బులతో ఆస్పత్రికి వచ్చిన రోగులు గంటల తరబడి బారులుదీరారు. పలువురు నిలబడే ఓపిక లేక ఆవరణలో నేలపై పడుకున్నారు. మరికొందరు మెట్లపై కూర్చొని నిరీక్షించారు. వీల్‌ఛైర్లు, స్ట్రెచర్ల సహకారం అందక యాతన పడ్డారు. ఈ విషయంపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనను కలిసిన కార్మిక సంఘాల నాయకులతో చర్చించారు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే వేతనాలు చెల్లిస్తామని వారికి హామీ ఇచ్చారు.



నిరసన ప్రదర్శనలో ఆసుపత్రి ఒప్పంద కార్మికులు



మెట్లపై వేచి చూస్తున్న రోగులు

11న సమీకృత గురుకుల పాఠశాలలకు శంకుస్థాపన

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాలకు మంజూరైన సమీకృత గురుకుల పాఠశాలల సముదాయ భవనాల నిర్మాణానికి 11న శంకుస్థాపన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తారని, నివేదికలు సిద్ధం చేయాలన్నారు. డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఈనెల 9న నియామక పత్రాలు అందిస్తారని, జిల్లా నుంచి 500 మందికి పైగా ఎంపికయ్యారని వారిని హైదరాబాద్ తరలించేందుకు బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, శిక్షణ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, ఎస్సీ సంక్షేమ అధికారి సత్యనారాయణ, డీఈఓ సోమశేఖర శర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, చిత్రంలో అదనపు కలెక్టర్ శ్రీజ